తొలిమంచు కురిసింది

ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం ఉదయం దట్టమైన పొగ మంచు కురిసింది. జాతీయ రహదారిపై వచ్చే వాహనాలు కనిపించక చోదకులు ఇబ్బంది పడ్డారు. ఉదయం వ్యాయామం చేసేవారు మంచు తీవ్రతతో కాసేపు విరామం తీసుకొని సూర్య కిరణాలు వచ్చిన తరువాత నడక మొదలుపెట్టారు. ఈ సంవత్సరం మొదటి సారిగా మంచు కురవడంతో ప్రకృతి ప్రేమికులు మంచులో తిరుగుతూ ఫొటోలు తీసుకుంటూ ఆనందించారు.

- ఈనాడు, ఆదిలాబాద్



మావల వద్ద జాతీయ రహదారిపై కురుస్తున్న పొగమంచు



బట్టిసావర్గాం రహదారిలో మంచు

ఈనాడు ఆదిలాబాద్

గురువారం అక్టోబరు 10, 2024

నేటి నుంచి బేలలో సోయా కొనుగోళ్లు

బేల, న్యూస్‌టుడే : బేల ఉప మార్కెట్ యార్డులో గురువారం ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని బేల సహకార సంఘం సీఈఓ తిరుపతి తెలిపారు.

పత్తి ధర.. కాకూడదు దగా

● ఇప్పుడే చక్రం తిప్పుతున్న వ్యాపారులు

ఈటీవీ - ఆదిలాబాద్


ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 10.15 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా.. 71.05 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని మార్కెటింగ్‌శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర రూ.7521గా నిర్ణయించింది. ప్రస్తుతం ప్రైవేటులో రూ.7,700 పైచిలుకు ధర పలుకుతోంది. ఒకవేళ ఇదే ధర కొనసాగితే భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోళ్లు చేస్తుందా? లేదా? అనేది ప్రశ్నార్థకమే. సీసీఐ పోటీ లేకపోతే నాణ్యత, తేమ పేరిట రైతులకు నష్టం జరిగే అవకాశం ఉంది. ఆదిలాబాద్, భైంసా, జైనూర్, ఆసిఫాబాద్ ప్రాంతాల్లో సిండికేట్‌గా ఉన్న కొందరు ప్రైవేటు వ్యాపారులు ఇప్పటికే సీసీఐ పాత్రను పరిమితం చేయటం కోసం ప్రయత్నాలు చేస్తున్నందునే కొనుగోళ్ల ముహూర్తం ఖరారు కాలేదని తెలుస్తోంది.



ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డు

సీసీఐ పాత్ర ఏమిటి?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీసీఐ రెండు విధాలుగా పత్తి కొనుగోళ్లు చేయడానికి వెసులుబాటుంది. మొదటిది బహిరంగ మార్కెట్లో మద్దతు ధర కంటే తక్కువ ధరతో వ్యాపారులు కొనుగోళ్లు చేస్తుంటే సీసీఐ రంగంలోకి దిగాలి. ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోళ్లు చేస్తూ రైతులు నష్టపోకుండా చూడాలి. రెండోది ప్రైవేటు వ్యక్తులతో పోటీ పడి కొనుగోళ్లు చేయటం. వ్యాపారులు ఏకమైతే సీసీఐ వల్ల రైతుకు న్యాయం జరుగుతుంది. కానీ ఆ సంస్థ ఇప్పుడు రంగంలో ఉంటుందా? లేదా? అనేది అనుమానాలకు తావిస్తోంది.



నేతలతో సమాలోచన

దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భైంసా వ్యవసాయ మార్కెట్‌యార్డుల పరిధిలోనే అత్యధికంగా పత్తి అమ్మకానికి వస్తోంది. మంచిర్యాల జిల్లాలో చివరిస్థానంలో నిలుస్తోంది. ధర నిర్ణయంలో వ్యాపారుల మాట చెల్లుబాటవుతోంది. ఆదిలాబాద్, భైంసా, ఆసిఫాబాద్‌లో కొంతమంది నేతలతో వ్యాపారులు అంతర్గత సమాలోచనలు చేయటం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఒకవేళ నేతలు ఒత్తిడి చేస్తే ఇప్పటికే కొనుగోళ్ల ముహూర్తం ఖరారయ్యేది. కానీ అలా జరగటం లేదు. పత్తి వ్యాపారంలో చక్రం తిప్పడంలో అనుభవం కలిగిన భైంసాకు చెందిన కొందరు నేతల పాత్ర కీలకంగా ఉన్నట్లు వ్యాపార వర్గాల ద్వారా తెలియవచ్చింది. ఆదిలాబాద్ లాంటి ప్రాంతాల్లో కొనుగోళ్ల ముహూర్తం ఖరారు కాకపోవటం అనుమానాలకు తావిస్తోంది. అఖిలపక్ష నేతలను మినహాయిస్తే ప్రజాప్రతినిధులెవరూ పత్తి కొనుగోళ్లపై ఆసక్తి చూపకపోవటం విమర్శలకు తావిస్తోంది



తలమడుగు మండలం కప్పర్ దేవి నుంచి ఇంద్రా నగర్ ఉమ్రి మీదుగా దహెగాం వరకు రూ.1.10 కోట్లతో 7.50 కిలోమీటర్ల రహదారి పనులకు 2022 జులై 26న గుత్తేదారుతో ఒప్పందం జరిగింది. 2023 అక్టోబరు 25లోగా పనులు పూర్తి కావాల్సి ఉండగా చేయలేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 15 రోజుల కిందట ఓ యువకుడు టిప్పర్ ఢీకొనడంతో చనిపోయాడు. పలుచోట్ల కంకరవేసి వదిలేశారు.

జైనథ్ మండలం బాలాపూర్ నుంచి ఆకుర్ల వరకు 2.22 కిలోమీటర్ల రహదారి పనులకు రూ. 53 లక్షల వ్యయంతో 2022 డిసెంబరు 8న టెండర్లు పూర్తయ్యాయి. ఇంతవరకు అక్కడ పని మొదలెట్టలేదు. అధ్వాన రహదారితో ప్రజలు నరకయాతన పడుతున్నారు.



కంకర దారులు.. గుంతల చింతలు

● పనులు పూర్తికాక ప్రజల నరకయాతన

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం

అడుగేస్తే గుంత.. మరో అడుగేస్తే కోసుకుపోయిన రహదారి.. కొన్నిచోట్ల కంకర కుప్పలు. వెరసి వాహనదారుల రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. ఎక్కడ ఎప్పుడు కింద పడిపోతామనే భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ఈ దారులపై వెళ్లాలంటే పగలే చుక్కలు చూస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. ఆటోలో వెళ్లే గర్భిణులు, వృద్ధులు, పిల్లల కష్టాలు వర్ణనాతీతం. జిల్లాలోని పలు గ్రామాలకు నిధులు మంజూరైనా పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ కింద కేటాయించిన ఈ పనులు పూర్తి చేసేందుకు గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు.

రెండు పథకాల కింద..

మెయింటెనెన్స్ ఆఫ్ రూరల్ రోడ్స్ (ఎంఆర్ఆర్), ఫ్లడ్ డ్యామేజ్ రోడ్స్ (ఎఫ్‌డీఆర్) కింద జిల్లాలో వివిధ రహదారులకు 2020లోనే నిధులు కేటాయించారు. కొన్ని పనులకు టెండర్లు ఆలస్యమయ్యాయి. మరికొన్ని గుత్తేదారులు ఒప్పందం చేసుకోవడంతో జాప్యం చేశారు. గుత్తేదారుల ఉదాసీనతతో చాలాచోట్ల పనులు నత్తతో పోటీపడుతున్నాయి. ఏడాదిలోగానే పూర్తి కావాల్సిన రూ.143.73 కోట్ల పనులు సాగుతూనే ఉన్నాయి.

చేస్తూ.. వదిలేస్తూ..

మరికొన్ని చోట్ల రహదారులు అధ్వానంగా మారాయి. ఇష్టమున్నప్పుడు కంకర, ఇసుక కుప్పలు వేస్తూ వదిలేస్తుండటమే దీనికి కారణం. ఇసుక, కంకర రహదారిపైనే ఉండటంతో ద్విచక్ర వాహనదారులు జారి కింద పడిపోతూ గాయాలపాలవుతున్నారు.

రహదారుల వివరాలు

పథకం	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)	దారుల పొడవు (కిలోమీటర్లు)	పనుల సంఖ్య	ఖర్చుచేసినది (రూ.కోట్లలో)	పూర్తిచేసినది (కిలోమీటర్లు)	ఖర్చు చేయాల్సింది (రూ.కోట్లలో)
ఎంఆర్ఆర్	52.32	124.56	45	3.52	59.37	48.80
ఎఫ్‌డీఆర్	91.40	121.00	84	2.20	20.10	89.19
మొత్తం	143.72	245.56	129	5.72	79.47	137.99

పనులు పూర్తి చేయిస్తాం

శివరాం, పంచాయతీరాజ్ ఈఈ

పనులు పూర్తి చేయాలని గుత్తేదారులపై ఒత్తిడి తెస్తున్నాం. కొన్ని చోట్ల గడువు ముగిసిన మాట వాస్తవమే. ఆ పనులపై ప్రత్యేక దృష్టిసారించి పూర్తయ్యేలా చూస్తున్నాం. నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు చేపడతాం.

సర్వే వివరాలు తప్పుల్లేకుండా నమోదు చేయండి

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డిజిటల్ కార్డుల జారీ కోసం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు సర్వే వివరాలను తప్పుల్లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పాలనాధికారి రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సర్వే వివరాల నమోదుపై బుధవారం పాలనాధికారి సమీక్షించారు. అదనపు పాలనాధికారి శ్యామలదేవి, జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనరు ఖమర్ అహ్మద్, ఈడీఎం రవి, డీఎల్‌పీవో ఫణిందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ పట్టభద్ర, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోందని పాలనాధికారి రాజర్షిషా తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయాల్లో నమోదుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

బల్దియాకు నిధులు విడుదల చేయండి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : బల్దియా అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి కోరారు. బుధవారం హైదరాబాద్‌లో పురపాలక శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి దాన కిశోర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బల్దియాకు టీయూఎఫ్ఐడీసీ కింద గతంలో ప్రతిపాదించిన రూ.6.40 కోట్లను విడుదల చేయాలని విన్నవించారు.

చమక్కుమనేలా..

లక్కారం చెరువు సుందరీకరణ

● రూ. 8 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం

న్యూస్‌టుడే, ఉట్నూరు గ్రామీణం



లక్కారం నుంచి చింతగూడకు వెళ్లే రోడ్డు

ఉట్నూరు మండలం లక్కారం చెరువుతోపాటు చింతగూడ వరకు రోడ్డు సుందరంగా మారనుంది. లక్కారం, సుద్దగూడ, కల్లూరుగూడ మీదుగా చింతగూడ వరకు రెండు వరుసల రహదారి కానుంది. లక్కారం నుంచి చింతగూడ వరకు చెరువు కట్ట మినీ ట్యాంకు బండ్‌గా మారనుంది. సుందరీకరణకు ప్రత్యేక నిధులు రూ. 8కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపారు. 4 కి.మీ పొడవునా 5 మీటర్ల వెడల్పుతో రోడ్డును ఆనుకుని ఉన్న చెరువును, కల్లూరుగూడ సమీపాన ఉన్న చెరువు కెనాల్‌పై వంతెనను ఆధునికీకరించేందుకు నమూనాలు తయారు చేశారు. ఈ రోడ్డు సుద్దగూడ, కల్లూరుగూడ, శంభుగూడ, చింతగూడ, కొత్తగూడ, ఘన్‌పూర్, దంతనపల్లి ప్రాంత ప్రజలకు రింగ్‌రోడ్డు కానుంది.



కల్లూరుగూడ చెరువు కెనాల్‌పై వంతెన నిర్మించే ప్రాంతం

పనులు ఇలా..

లక్కారం సమీపాన ఉన్న చెరువు కట్టకు మధ్యలో విభాగినులతో పాటు విద్యుత్తు వీధి దీపాలు ఏర్పాటు చేయనున్నారు. చెరువు కట్ట ప్రారంభంలో ఆకర్షించే విధంగా పలు నమూనాలు ఏర్పాటు చేస్తారు. చెరువు ప్రాంతం మినీట్యాంకు బండ్‌గా మార్చేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

కష్టాలు దూరం..

వర్షాకాలం వస్తే చాలు మండల కేంద్రానికి రావడానికి ప్రజలు పడే కష్టాలు దూరం కానున్నాయి. చింతగూడ, కల్లూరుగూడ సమీపాన ఉన్న చెరువు కెనాల్‌పై రాకపోకలు సాగడానికి వీలుండదు. కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణంతో పాటు డబుల్ రోడ్డుతో రాకపోకల బాధలు దూరం కానున్నాయి.

త్వరలోనే నిర్మాణ పనులు



వెడ్మ బొజ్జు, ఎమ్మెల్యే ఖానాపూర్

ఉట్నూరు నుంచి చింతగూడకు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. ఈ రోడ్డు నిర్మాణంతో ఉట్నూరు నుంచి లక్కారం, సుద్దగూడ, కల్లూరుగూడ, చింతగూడ, కొత్తగూడ ఘన్‌పూర్ మీదుగా దంతనపల్లికి రింగ్ రోడ్డు తయారవుతుంది. ఆ ప్రాంత ప్రజలకు విద్య, వైద్యంతో పాటు మండల కేంద్రానికి రావడానికి సులువుగా ఉంటుంది.



స్వామి పల్లకిని ఊరేగిస్తున్న ఆడబిడ్డలు



వేంకటేశ్వరుడికి చేయించిన మకరతోరణం

వేంకటేశ్వరస్వామికి ఆడబిడ్డల కానుక

● మకరతోరణానికి రూ.3.25 లక్షల విరాళం

తలమడుగు, న్యూస్‌టుడే : తలమడుగు గ్రామ ఆడ బిడ్డలంతా రూ.3.25 లక్షల విలువ చేసే మకరతోరణంతో పాటు ఆభరణాలను వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం సమర్పించారు. ఉదయం దేవతల ప్రతిమలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో స్వామికి మకరతోరణం, ఆభరణాలను అలంకరించారు. పట్టువస్త్రాలను అందజేశారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఆడపడుచులు ఆలయానికి తరలిరావడంతో పండగ వాతావరణం నెలకొంది. మహిళలు భక్తిపాటలు, కోలాట నృత్యాలతో అలరించారు. సార్వజనిక్ ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంద్రాసేన్‌రెడ్డి, కాటిపెల్లి వసంత్‌రెడ్డి, పద్మాకర్‌రెడ్డి, అభిరామ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అసంరవీందర్, కాటిపెల్లి రాంరెడ్డి, వెంకటేష్, మాజీ సర్పంచి కరుణాకర్‌రెడ్డి, శ్రీకాంత్, నవీన్‌రెడ్డి, బగరి శ్రీకాంత్, తిరుపతిరెడ్డి, రవికాంత్‌యాదవ్, మొరపాక శ్రీకాంత్, ప్రశాంత్‌రావు, సుదర్శన్‌రెడ్డి సంతోష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

తపాలా వారోత్సవాలు ప్రారంభం

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలో బుధవారం తపాలా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా తపాలా పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్ధార్థ సిబ్బందితో కలిసి ప్రధాన తపాలా కార్యాలయంలో శాఖకు సంబంధించిన సేవలు, పథకాలను వినియోగదారులకు వివరించారు. మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.



హైదరాబాద్‌కు తరలిన డీఎస్సీ అభ్యర్థులు

పాలనాప్రాంగణం, ఉట్నూరు: డీఎస్సీ-2024లో ఎంపికైన అభ్యర్థులను ఆదిలాబాద్ నుంచి బుధవారం ఉదయం విద్యాశాఖ ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు తరలించారు. ఆదిలాబాద్, ఉట్నూరు, ఇచ్చోడ, బోథ్ నుంచి ఏడు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచారు. డీఈవో ప్రణీత, లైజన్ ఆఫీసర్లు యన్.స్వామి, బి.రాజ్‌కుమార్, ప్రకాశ్, బాలకిషన్, సంజీవ్‌రాఠోడ్, శ్రీనివాస్ అభ్యర్థుల వెంట వెళ్లారు. మొత్తం 265 మంది అభ్యర్థులు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి సభకు తరలివెళ్లి అక్కడ నియామకపత్రాలు అందుకున్నారు.

కేంద్ర పథకాల అమలుపై ఆరా

భీంపూర్, బోథ్, న్యూస్‌టుడే : జాతీయస్థాయి పర్యవేక్షక బృంద సభ్యులు రఘునాథ్, నాగరాజు బుధవారం భీంపూర్ మండలంలోని కైరిగూడ, గుంజాల గ్రామాలను సందర్శించారు. అక్కడ అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. బోథ్ మండలం పిప్పల్‌దరి, కేశవపట్నం, వజ్జర్ గ్రామాలలో పర్యటించారు. ఉపాధి పనులను పరిశీలించారు. డీఆర్‌డీఏ అధికారులు కుటుంబరావు, కృష్ణారావు, ఎంపీడీవోలు గోపాలకృష్ణరెడ్డి, జీవన్‌రెడ్డి, డీటీ హరిదాస్, ఈజీఎస్, ఐకేపీ ఏపీఎంలు సంగీత, ప్రసాద్, మాధవ్, ఈసీ నరేందర్, టీఏలు మజర్, అనసూయ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సైబర్ వల.. కానుల కాజేత

● ఆన్‌లైన్ షాపింగ్‌లో అప్రమత్తత అవసరం

☛ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ యువకుడికి ఆన్‌లైన్‌లో ఓ ప్రముఖ కంపెనీ నుంచి చరవాణులపై 40 శాతం ఆఫర్లు ఉన్నాయంటూ సందేశం వచ్చింది. దీంతో ఆ యువకుడు కంపెనీ పంపిన వివరాలకు అనుగుణంగా బ్యాంకు ఖాతా ద్వారా రూ.35 వేలు పంపించాడు. వారం రోజులు గడిచినా తనకు ఎలాంటి పార్సిల్ రాకపోవడంతో సంస్థ చూపిన చరవాణికి నంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని తేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



☛ ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం దేగామకు చెందిన ఉదయ్ ఓ చరవాణి ఆర్డర్ చేయగా మంగళవారం మధ్యాహ్నం డెలివరీ బాయ్ వచ్చి అందించాడు. అతడి సమక్షంలో తెరిచి చూడగా రాళ్లు, సబ్బు బిళ్ల వచ్చాయి.



మంచిర్యాల నేరవిభాగం, చెన్నూరు, న్యూస్‌టుడే:

కొద్దిరోజుల్లో బతుకమ్మ, దసరా, దీపావళి పండగలు రానున్నాయి. పండగలంటే నూతన వస్త్రాలు, అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఆఫర్ల పేరుతో వల వేయనున్నారు. ఆకట్టుకునే ప్రకటనలకు ఆశపడితే మొదటికే మోసపోయే ప్రమాదం లేకపోలేదు. అనవసరపు లింక్‌లకు క్లిక్ చేస్తే మనం తేరుకునే లోపే ఖాతాలు ఖాళీ అవుతాయి.

పండగ పూట.. పారాహుషార్

ఉమ్మడి జిల్లాలో సగటున సాధారణ రోజుల్లో సుమారు రూ.25 లక్షల వరకు ఆన్‌లైన్ వ్యాపారం జరుగుతుంది. పండగ వేళ రోజుకు ఇది రూ.50 లక్షల వరకు జరుగుతుంది. ఈ సమయంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, తదితర సామాజిక మాధ్యమాల్లో ఆఫర్ల పేరుతో ప్రకటనలు పంపిస్తారు. చరవాణులు, దుస్తులు, చేతిగడియారాలు, తదితర అలంకరణ వస్తువుల లోగోలను పంపి మార్కెట్ ధర కంటే 30 నుంచి 50 శాతం వరకు తగ్గింపు ధరలకు ఇస్తామంటూ మాయ చేస్తారు. ఆన్‌లైన్‌లో ఉండగానే వస్తువు కొనుగోలు చేయాలని సమయం మించిపోతుందని తొందరపెడతారు. అలాగని మన బ్యాంకు ఖాతా వివరాలు పంపిస్తే డబ్బులు మాయమవుతాయి. మంచిర్యాల జిల్లాలో జనవరి 1 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు 122 సైబర్‌క్రైం కేసులు నమోదయ్యాయి.

తక్కువ ధరలంటే నమ్మవద్దు

సైబర్ మోసగాళ్లు భారీ ఆఫర్లు ఇస్తామని చెప్పి యాప్‌ల ద్వారా ప్రకటనలు ఇస్తారు. మార్కెట్‌లో రూ.లక్షకుపైగా ఉన్న చరవాణులపై 75 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తామని ప్రచారం చేస్తారు. వీటిని నమ్మి మోసపోవద్దు. నమ్మకమైన వెబ్‌సైట్‌ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. డెలివరీ సమయంలో వీడియో రికార్డు చేసి ఉంచుకోవాలి.

1930 టోల్‌ఫ్రీ నంబరు

సైబర్‌క్రైం పోలీసుల దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేసేలోపే నేరగాళ్లు డబ్బును ఖాతాల నుంచి లాగేసుకుంటున్నారు. ఖాతా నుంచి డబ్బు పోయినట్లు గుర్తించగానే కేంద్రహోంశాఖ హెల్ప్‌లైన్ నంబరు 1930కు ఫిర్యాదు చేయాలి.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, బోథ్:

? బోథ్ మండలం కౌఠ శివారులోని పంట పొలాలకు విద్యుత్తును సరఫరా చేసే ఎస్ఎస్-10 విద్యుత్తు నియంత్రిక ఓవర్‌లోడ్ కారణంగా తరచూ జంపర్లు ఎగిరిపోతున్నాయి. ఫ్యూజులు సైతం కాలిపోతున్నాయి. రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. - **రైతులు, కౌఠ**

✔ విద్యుత్తు నియంత్రికను పరిశీలించి రైతులతో మాట్లాడతాం. - **వెంకటేష్, ఏఈ, బోథ్**

న్యూస్‌టుడే, తాంసి:

? తాంసి మండలం ఈదుల్లా సావర్గాంలో రైతుల చేలల్లోని మోటార్లకు కరెంట్ సరఫరా లేక పత్తి పంటకు నీటి తడి ఇవ్వలేకపోతున్నాం. సమస్యను సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు. - **సాయి, సావర్గాం, రైతు**

✔ ముళ్ల పొదలు, చెట్లు పెరగడంతో విద్యుత్తు సరఫరా సరిగా ఉండటం లేదు. పరిశీలించి చెట్ల కొమ్మలు తొలగించి, కరెంట్ సరఫరా ఇస్తాం. - **దేవరాజ్, విద్యుత్తు అధికారి**

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

? ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీకూడలి నుంచి బ్రాహ్మణవాడకు వెళ్లే రోడ్డు గుంతలమయమైంది. కొందరు రోడ్డుపైనే వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - **అజయ్, బ్రాహ్మణవాడ**

✔ గుంతలు పడిన రహదారికి మరమ్మతులు చేయిస్తాం. రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు ఏర్పాటు చేసుకున్న వారిని తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - **ఎండీ ఖమర్ అహ్మద్, పుర కమిషనర్**

అన్నదాతలకు కుర్చీల ఏర్పాటు

వందనం

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో సౌకర్యాలు కొరవడటంతో పనుల కోసం వచ్చిన అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. కూర్చోవడానికి కనీసం కుర్చీలు లేకపోవడం. తాగునీరు, మూత్రశాలలు లేక అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితిపై ఈ నెల 8న 'ఈనాడు'లో 'సౌకర్యాల కరవు.. సమస్యల నెలవు' శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. ఆదిలాబాద్ గ్రామీణ మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గోవింద్, నాయబ్ తహసీల్దార్ సాయి మహేశ్‌లు అన్నదాతల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్డులో కుర్చీలు ఏర్పాటు చేయించారు. తాగునీటి వసతి కల్పించనున్నట్లు తెలిపారు.



ప్రత్యేక షెడ్డులో ఏర్పాటు చేసిన కుర్చీల్లో కూర్చున్న రైతులు

అప్పుల బాధతో రైలు కింద పడి ఆత్మహత్య

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పట్టణ సమీపంలో రైల్వే పట్టాలపై రైలు ఢీకొని తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని జీఆర్‌పీ పోలీసులు గుర్తించారు. జీఆర్‌పీ ఇన్‌ఛార్జి భోజన్న తెలిపిన వివరాల ప్రకారం.. కిన్వట్‌కు చెందిన కుంబల్‌వార్ విలాస్ అత్తారింట్లో ఉంటున్నాడు. ఆదిలాబాద్‌కు మూడు రోజుల కిందట వచ్చాడు. కిన్వట్‌లో అతడు అప్పుల పాలయ్యాడు. మంగళవారం ఆదిలాబాద్‌లోని అత్తారింటి నుంచి బయలుదేరిన అతడు కాలినడకన రైలు పట్టాలపై వెళుతూ పూర్ణ ఎక్స్‌ప్రెస్ వచ్చేటప్పుడు ఆత్మహత్య చేసుకోవటానికి రైలుకు ఎదురుగా వెళ్లాడు. గమనించి లోకోపైలెట్ రైలును ఆపటానికి ప్రయత్నించినా రైలు అతడిని ఢీకొని తలకు తీవ్ర గాయాలయ్యాయి. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. జీఆర్‌పీ పోలీసులు బుధవారం పంచనామా చేసి శవ పరీక్ష చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఘోట్కురిలో చోరీ

తాంసి, న్యూస్‌టుడే : ఘోట్కురిలో నేరెళ్ల అశోక్ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తాంసి ఎస్సై శివరాం తెలిపారు. అశోక్ కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి స్థానిక దుర్గామాత మండపం వద్ద జరిగిన పూజా కార్యక్రమానికి వెళ్లారు. తిరిగి రాత్రి 12.30 గంటలకు ఇంటికి చేరుకుని చూసేసరికి.. బీరువాలో ఉంచిన రూ.50 వేల నగదు, 25 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

కిరాణా దుకాణంలో..

ఇచ్చోడ(నేరడిగొండ), న్యూస్‌టుడే : నేరడిగొండ కుప్టి గ్రామానికి చెందిన గంగయ్య గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. బుధవారం వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉండగా, లోపల సామగ్రి చిందరవందరగా పడేసి ఉంది. రూ.47 వేలు ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : పట్టణంలోని రాంనగర్‌కు చెందిన బి.అరవింద్-శ్రీలత దంపతుల నాలుగేళ్ల కుమారుడు సుశాంత్ రాంనగర్‌లోని దుర్గామాత మండపం వద్ద తన అన్నతో ఆడుకుంటూ తప్పిపోయాడు. దాదాపు ఒక కిలోమీటరు వరకు నడుచుకుంటూ తిరుమల పెట్రోలు బంకు వద్దకు చేరుకొని ఏడుస్తూ ఉండటాన్ని స్థానికులు గమనించి డయల్-100కు సమాచారం అందించారు. కానిస్టేబుల్ విఠల్, హోంగార్డు మహేశ్‌రెడ్డి బాబును మావల పోలీసు స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రుల జాడ తెలుసుకొని స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు. బాబును తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులను మావల ఎస్ఐ విష్ణువర్ధన్ అభినందించారు.

నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ఇచ్చోడ, న్యూస్‌టుడే : దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ భీమేష్ సూచించారు. బుధవారం ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై తిరుపతి ఉన్నారు.

అన్నదానానికి బియ్యం వితరణ

బేల, న్యూస్‌టుడే : బేలలో దుర్గాదేవి మండపాల వద్ద నిర్వహించే అన్నదానం కోసం బీజేవైఎం మండల అధ్యక్షుడు నవీన్ పోత్‌రాజ్ 7 క్వింటాళ్ల బియ్యం అందజేశారు. నాయకులతో మండలపాలకు వెళ్లి బియ్యం అందజేశారు. నాయకులు గణేష్, ఇంద్రశేఖర్, మహేశ్, నారాయణ, సాయి, రాజు పాల్గొన్నారు.

పేదరికాన్ని జయించి.. ఉద్యోగాలు సాధించి!

బోథ్, న్యూస్‌టుడే : శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిస అవుతుంది అన్న స్వామి వివేకానంద మాటలను ఈ యువకులు విజయానికి బాటలుగా మలుచుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే ఏళ్లు కష్టపడి చదవాలి. పేదరికాన్ని తట్టుకొని పిన్న వయసులో ఒకరు విజయం సాధిస్తే.. చివరి ప్రయత్నమంటూ మరొకరు ఉపాధ్యాయ కొలువులు సాధించి ఆదర్శంగా నిలిచారు.

45 ఏళ్ల వయసులో..

పేదరికాన్ని ఎదుర్కొంటూ మొక్కవోని దీక్షతో ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. కూలీకి వెళితేనే పూట గడిచే పరిస్థితి. విజయం సాధించటానికి వయసు అడ్డంకి కాదని నిరూపిస్తూ, ఎన్ని అపజయాలు ఎదురైనా శ్రమని ఆయుధంగా మార్చి 45 ఏళ్ల వయసులో ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాడు. బోథ్ మండల కేంద్రానికి చెందిన ఉసికెల గంగాధర్ ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. స్కూల్ అసిస్టెంట్ సాంఘికశాస్త్రం విభాగంలో జిల్లా స్థాయిలో 13వ ర్యాంకు సాధించి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాడు. తల్లి తార చిన్నతనంలోనే దూరమవటంతో అమ్మమ్మ, బంధువుల ఇళ్లల్లో పెరిగాడు. తండ్రి కొండయ్య, బంధువుల ప్రోత్సాహంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చదువు పూర్తి చేశాడు. 10వ తరగతి, ఇంటర్ వరకు స్థానికంగా, డిగ్రీ ఆదిలాబాద్ ప్రభుత్వ కళాశాలలో, బీఈడీ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. ఒక పక్క చదువుకుంటూనే కూలీ పనులు చేయాల్సిన పరిస్థితి. పాన్‌టేలా నడుపుతూ, రోజూవారీ కూలీకి వెళ్లి, ప్రైవేటు పాఠశాలలో ఉద్యోగం చేస్తూ చదువును కొనసాగించాడు. 45వ ఏట ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాడు.



కుటుంబసభ్యులతో ఉసికెల గంగాధర్

మూడు ప్రభుత్వ కొలువులతో

బోథ్ మండలం సొనాలకు చెందిన రామాయి రణధీర్ తల్లిదండ్రులు సుమలత, నారాయణ. తల్లి బీడీ కార్మికురాలిగా, తండ్రి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్ననాటి నుంచే సదరు యువకుడు చదువులో ముందంజలో ఉన్నాడు. పదో తరగతి వరకు స్థానిక పాఠశాలలో చదివాడు. పదో తరగతిలో మండలంలో ఉత్తమ మార్కులు సాధించి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. రెండేళ్లు అక్కడే ఇంటర్ పూర్తి చేశాడు. అనంతరం ఆదిలాబాద్‌లోని డైట్ కాలేజీలో సీటు సంపాదించి, రెండేళ్లు ఉపాధ్యాయ కోర్సును పూర్తి చేశాడు. తపాలాశాఖలో 2018లో ఉద్యోగం సాధించాడు. అయిదేళ్లు విధులు నిర్వహిస్తూనే చదువును కొనసాగిస్తూ, పలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన కానిస్టేబుల్ ఉద్యోగ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటాడు. అగ్నిమాపకశాఖలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. ఇచ్చోడలోని అగ్నిమాపక కేంద్రంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కానిస్టేబుల్‌గా తన శిక్షణను కొనసాగిస్తున్న సమయంలో ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక పక్క శిక్షణ కొనసాగిస్తూ, డీఎస్సీకి సమయాన్ని కేటాయించుకొని రాత్రింబవళ్లు కష్టపడ్డాడు. డీఎస్సీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.



తల్లిదండ్రులతో రామాయి రణధీర్

డీఎస్సీ నియామకాలపై ఫిర్యాదుల వెల్లువ

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక తుది జాబితాలో దొర్లిన పొరపాట్లు అభ్యర్థులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. పొరపాట్లను సవరించాలని ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. పలువురు అభ్యర్థులు తమ స్థానంలో ఇతరులను ఎంపిక చేశారంటూ బుధవారం పాలనాధికారి రాజర్షిషాను కలిసి తమ గోడును వినిపించారు. ఎస్జీటీ తెలుగు మాధ్యమ విభాగంలో 12వ ర్యాంకు సాధించిన తనకు 1:1 జాబితాలో చోటు దక్కలేదని, తన కంటే ఎక్కువ ర్యాంకులు ఉన్నవారి పేర్లు ఉన్నాయని అభ్యర్థి ఎం. సాయికృష్ణ వాపోయారు. మరాఠీ మాధ్యమంలో ఎస్జీటీ విభాగంలో 51వ ర్యాంకరుకు స్థానం కల్పించి తమను విస్మరించారని 34, 44 ర్యాంకర్లు కె.పల్లవి, వినోద్‌కుమార్‌లు వాపోయారు. స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఎస్జీటీ, ఎస్ఏ రెండు పోస్టులకు ఎంపికయ్యాయని, ఎస్జీటీ ఎంపిక చేసుకుంటే ఎస్ఏ ఇచ్చారని, సవరించాలని అభ్యర్థి సౌజన్య తరపు బంధువుల విన్నవించారు. నాలుగు ఉద్యోగాలకు ఎంపికైన శివాజీ మొదటి ప్రాధాన్యం కింద ఎస్ఏ ఫిజికల్ సైన్సును కోరుకోగా.. ఎస్ఏ తెలుగు జాబితాలో పేరు వచ్చిందని ఆయన డీఈవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఉర్దూ మాధ్యమంలో షీరీన్ పర్వీన్ ఎస్ఏ బయోసైన్సుతో పాటు ఎస్జీటీ విభాగంలో మొదటి ర్యాంకును సాధించగా.. కోరుకున్న పోస్టు కాకుండా మరొకటి ఇవ్వడంతో ఆమె కేటగిరి సవరణ కోసం వినతిపత్రం అందజేశారు. చోటుదక్కని ర్యాంకర్లకు తుది జాబితాలో చోటు కల్పిస్తే ఇప్పటికే సీఎం సభకు వెళ్లి నియామకపత్రాలు అందుకున్న వారిలో పలువురు అవకాశం కోల్పోనున్నారు. ఆయా ఫిర్యాదులను ఇప్పటికే జిల్లా అధికారులు రాష్ట్ర పాఠశాల విద్యావిభాగానికి పంపించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు తీసుకోనున్నారు. ఎవరిపై వేటు పడుతుందనే ఆందోళన అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది.



కలెక్టరేట్‌కు వచ్చిన బాధిత అభ్యర్థులు, వారి బంధువులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు

పట్టణ బంద్ ప్రశాంతం

ఎదులాపురం, న్యూస్‌టుడే : మొహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ముస్లింలు ఇచ్చిన పట్టణ బంద్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. బంద్ విజయవంతం చేయటానికి పలువురు ముస్లింలు ఖుర్షిద్‌నగర్ నుంచి ద్విచక్ర వాహన ప్రారంభించి పట్టణంలోని పలు ప్రధాన రహదారుల్లో తిరుగుతూ వ్యాపారులు బంద్‌కు సహకరించాలని కోరారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎస్పీ గౌస్ ఆలం సైతం బందోబస్తును పరిశీలించారు.



ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

రోగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

బజార్‌హత్నూర్, న్యూస్‌టుడే : పీహెచ్‌సీకి వచ్చే రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ అదనపు డీఎంహెచ్‌ఓ మనోహర్ అన్నారు. ఆసుపత్రిని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వైద్యాధికారిణి మౌనిక, సిబ్బంది ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

బోథ్, న్యూస్‌టుడే : కైలాస్‌టెకిడి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నర్మదేశ్వరుని ఆలయంలో బుధవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు లింబాజీ మహారాజ్‌తో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. రూ.12 కోట్లతో ఆలయానికి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, అటవీ అనుమతులు రావాల్సి ఉందన్నారు. నిగిని గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగదాంబదేవి, సేవాలాల్ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి, నాయకులు సురేందర్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, స్వామి, దుక్కరింసింగ్, ప్రవీణ్, సుధీర్‌రెడ్డి, బాపురెడ్డి, రూప్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.



కైలాస్‌టెకిడి శివాలయంలో నాయకులతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఉట్నూరులో భాజపా నేత రితేష్ రాథోడ్‌కు మిఠాయి తినిపిస్తున్న కార్యకర్తలు

అదనపు పీపీగా బాధ్యతలు చేపట్టిన షాహీన్‌సుల్తానా

ఎదులాపురం: లక్సెట్టిపేట ఏపీపీగా పని చేస్తూ అదనపు పీపీ గ్రేడ్-2గా పదోన్నతి పొంది ఆదిలాబాద్‌కు బదిలీ అయిన షాహీన్ సుల్తానా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆదిలాబాద్‌లో ఖాళీగా ఉన్న డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పూర్తి అదనపు బాధ్యతలు సైతం స్వీకరించారు. ఆమె అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ప్రమీలాజైన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పీపీలు రమణారెడ్డి, సంజయ్, మధుకర్, లైజన్ అధికారులు సయ్యద్ తాజ్‌ఉద్దీన్, గంగాసింగ్, జి.పండరి, ఈశ్వర్‌సింగ్, రాఘవేంద్రరావు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



సహాయ సెషన్స్ జడ్జి ప్రమీలా జైన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న షాహీన్ సుల్తానా

భారీ వర్షం

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని చాంద, జంధాపూర్, బీంసారి, తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం ఏరడానికి సిద్ధంగా ఉన్న పత్తి తడిసిపోయింది. భారీ వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు జలమయమయ్యాయి.



భారీ వర్షంతో రహదారిపై వరదనీరు

హరియాణాలో విజయంపై సంబరాలు

ఉట్నూరు, న్యూస్‌టుడే : హరియాణాలో భాజపా వరుసగా మూడోసారి విజయం సాధించడంపై బుధవారం ఉట్నూరులో ఆ పార్టీ నాయకుడు రితేష్ రాథోడ్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్, శేషారావు, సీపతి లింగాగౌడ్, జగ్జీవన్, ఆశన్న, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జీపీ



ఎదులాపురం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ గ్రామీణ మండలం భీంసరికి చెందిన పి.దయాకర్ ఆదిలాబాద్ కోర్టుల జీపీ(ప్రభుత్వ ప్లీడర్)గా నియామకమైన నేపథ్యంలో జిల్లా పాలనాధికారి రాజర్షిషాను కలుసుకున్నారు. పాతిక సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో ఉన్న పి.దయాకర్ జీపీగా విశిష్ట సేవలందించాలని పాలనాధికారి ఆయనకు సూచించారు.



నల్ల జెండాలతో నిరసన ర్యాలీ చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణపై కాలయాపన తగదు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని నిరసిస్తూ మాదిగ, ఉపకులాల సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ సంఘాల నాయకులు నల్లజెండాలను చేతబట్టుకుని నినాదాలు చేస్తూ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బాబూ జగ్జీవన్‌రామ్ కూడలి మీదుగా కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరి ఆందోళన చేశారు. కలెక్టర్ లేకపోవడంతో గేటుకు వినతిపత్రాన్ని అతికించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు కుడాల స్వామి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ మాదిగ, నాయకులు కాంబ్లె బాలాజీ, పసుల రాజు, చందాల రాజన్న, నవీన్, సుభాష్, శ్రీకాంత్, ఎల్లన్న, గణేష్, సాగర్, అశోక్, భూమయ్య, వేణు, శ్రీను, ప్రమోద్, వినోద్, రవి, రాజు, అశోక్, రవి, గోపి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ



చిరుధాన్యాలతో అలంకరించిన బతుకమ్మలతో బాలికలు



ఆదిలాబాద్ : కలెక్టర్ రాజర్షిషా, అధికారులు



కోర్టు సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, నగేష్



సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది

పాలనాప్రాంగణం, బోథ్, ఉట్నూరు, ఎదులాపురం, న్యూస్‌టుడే : బతుకమ్మ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ రాజర్షిషా పాల్గొని బతుకమ్మ ఆడారు. కోర్టుల సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.



వాయనం అందుకున్న డాక్టర్ మేనేని భావన, రాణి తదితరులు

నేటి బతుకమ్మ వేడుకలకు తరలిరండి

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలకు మహిళలు భారీగా తరలిరావాలని ప్రతినిధులు కత్తూర్‌వార్ మాలతి, శశికళ చౌహాన్, రేణికుంట రమ అన్నారు. స్థానిక రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ఏఎస్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకం

బేల, న్యూస్‌టుడే : ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బేలకు చెందిన అడ శంకర్ ఎన్నికయ్యారు. మేడారంలోని సమ్మక్క సారలమ్మ జంపన్న భవనంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో తమకు చోటు దక్కిందని ఆయన తెలిపారు. బుధవారం బేలలో తొమ్మిది తెగల నాయకులు ఆయన్ను సన్మానించారు. సోనేరావు, నందుకుమార్, జంగు, సంతోష్, పక్రు, కుశాల్, సకారం, జంగ్‌శావ్, రాందాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే మహాసభలు

ఎదులాపురం, న్యూస్‌టుడే : జిల్లాలోని సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 7, 8, 9వ తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభల్లో ఉద్యమ కార్యాచరణ కోసం తీర్మానాలు చేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ పేర్కొన్నారు. మహాసభల ప్రచార కరపత్రాలను బాసెట్టి మాధవరావు స్మారక కేంద్రంలో ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, ఆర్.మంజుల, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవి నవరాత్రి ఉత్సవాలు



సిర్సన్నలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు



ధన్నూర్‌లో నృత్యాలు చేస్తున్న మాలధారులు, శివసత్తులు



తాంసిలో..



లక్కారం బోనాలతో మహిళలు

ఆదిలాబాద్ గ్రామీణం, తాంసి, ఇంద్రవెల్లి, ఉట్నూరు గ్రామీణం, బోథ్, జైనథ్, పాలనాప్రాంగణం, జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాల్లో అమ్మవారు బుధవారం సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చనలు, అన్నదానాలను నిర్వహించారు. కుంకుమార్చనలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని చల్లగా చూడాలని మొక్కుకున్నారు.



జందాపూర్‌లో



భుక్తాపూర్ భవాని దుర్గా మండలి ఆధ్వర్యంలో..



ధనోర(బి)లో భారాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి జాన్సన్ నాయక్

ఉత్సాహంగా జిల్లాస్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణం బాక్సింగ్ హాలులో బుధవారం నిర్వహించిన అండర్-14, 17 ఏళ్ల విభాగం బాలబాలికల జిల్లా స్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి హాజరై మాట్లాడారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈ నెల 14న మంచిర్యాలలో నిర్వహించే జోనల్‌స్థాయి(ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా) పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. మాస్టర్ వీరేశ్, రెఫరీ వనిత, విశ్రాంత ఉద్యోగి అన్నారావు, కాంట్రాక్టర్ శివయ్య తదితరులు ఉన్నారు.

స్టీల్ బ్యాంకు ప్రారంభం

ఇచ్చోడ, న్యూస్‌టుడే : ఇచ్చోడ మండలం తలమద్రిలో ఇందిరా మహిళ శక్తి ఆధ్వర్యంలో సంతోషి మాత స్టీల్ బ్యాంకును ఎంపీడీఓ లక్ష్మణ్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు ఉన్నతంగా ఎదగాలన్నారు. ఏపీఎం దయాకర్, సీసీ మల్లయ్య తదితరులు ఉన్నారు.



గల్ఫ్ భరోసా.. విస్తరిస్తే బాగు

నిర్మల్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే దాదాపు 70 వేల మంది గల్ఫ్ దేశాలకు వెళ్లగా తాజాగా కొత్తతరం కూడా ఎడారి దేశాల బాట పడుతోంది. సాంకేతిక పరిజ్ఞానం లేని వారే ఆయా దేశాలకు వెళ్తుండటంతో వారంతా భవన నిర్మాణం, వ్యవసాయం వంటి పనుల్లో కుదురుతున్నారు. అక్కడి వాతావరణం, ఆహారం, తదితర పరిస్థితుల కారణంగా అనారోగ్యం, ఆపై మృత్యువాత పడుతున్న వారు కొందరైతే.. క్షణికావేశాలతో చేసే నేరాలతో జైళ్ల పాలవుతున్న వారు మరికొందరు. ఉమ్మడి జిల్లాలో ఏటా 30 నుంచి 40 మంది వరకు గుండెపోటు, మానసిక ఒత్తిడితో అనారోగ్యం కారణంగా చనిపోతుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గల్ఫ్ దేశాల్లో ఏ కారణంతో చనిపోయినా బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. దీన్ని 7 డిసెంబరు 2023 నుంచి అమలు చేయాలని జీవో జారీ చేసింది. పరిహారం చెల్లించడానికి రూ.10.60 కోట్లు విడుదల చేసింది.

● రూ.5 లక్షల పరిహారంపై బాధిత కుటుంబాల వేడుకోలు..

మిగతా దేశాల్లో పనిచేసే కార్మికులకు వర్తింపజేయాలి

కేంద్రం ఇమిగ్రేషన్ యాక్టు-1983ను రూపొందించింది. ప్రస్తుతం రూ.5 లక్షల పరిహారం బహ్రెయిన్, కువైట్, ఒమాన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్‌లో మరణించిన వారికి వర్తింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో మిగతా దేశాల్లోని కార్మికులకూ అమలు చేయాలని బాధిత కుటుంబాల సభ్యులు కోరుతున్నారు. అఫ్గనిస్తాన్, జోర్డాన్, లెబనాన్, లిబియా, మలేసియా, సుడాన్, సౌత్ సుడాన్, సిరియా, యెమెన్, ఇండోనేషియా, థాయిలాండ్, సింగపూర్, ఇజ్రాయిల్, కాంబోడియా, రష్యా, ఉక్రెయిన్, మల్దీవులు, తదితర దేశాల్లో ఉన్న వారికి కూడా వర్తింప చేయాలని విన్నవిస్తున్నారు. మరణించిన సమయంలో గల్ఫ్ దేశాల్లో ఉద్యోగానికి సంబంధించి రుజువైన వర్క్ వీసా, ఉద్యోగ ఒప్పందం వంటి ఆధారాలు సమర్పించాలనే నిబంధనతో చాలామంది ఆందోళనలో ఉన్నారు. ఆ దేశాల్లో యజమానులు పెట్టే బాధలు భరించలేక పారిపోయిన వారు కొందరు ఉండగా.. శాశ్వత ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించిన ఏజెంట్లు సందర్శక (విజిట్) వీసాపై గల్ఫ్ దేశాలకు పంపించడంతో అక్కడ పనిలేక అక్రమ నివాసులుగా ఉన్నారు. వీరిందరికీ ఈ పరిహారం వర్తించకపోవడంతో వందల సంఖ్యలో బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే అవకాశం కనిపించడం లేదు.

ఇతర దేశాలకు వర్తింప చేయాలి :



స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసిమిత్ర కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు

గల్ఫ్‌తోపాటు ఇతర దేశాల్లో పనిచేసే కార్మికులు ఏదైనా కారణంతో మరణిస్తే వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా వర్తింప చేయాలి. సందర్శక వీసాపై వెళ్లి అక్కడ అక్రమంగా నివసిస్తూ మరణించిన బాధిత కుటుంబాలకు పరిహారం అందజేయాలి. గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి సభ్యుల నియామకంలో విదేశాల్లో, స్వదేశంలో ఉన్న వారికి ప్రాతినిధ్యం కల్పించాలి. నకిలీ ఏజెంట్ల మోసాలను అరికట్టాలి. గల్ఫ్‌లో ఇబ్బందులు పడుతున్న వారితోపాటు ఇక్కడున్న వారి కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలి.

గల్ఫ్ దేశాలకు వెళ్లిన ఉమ్మడి జిల్లా వలస కార్మికులు : సుమారు 70 వేలు	వలస కార్మికుల కుటుంబ సభ్యులు : 2.50 లక్షలు	ఉమ్మడి జిల్లాలో 7 డిసెంబరు 2023 నుంచి ఇప్పటివరకు గల్ఫ్ దేశాల్లో చనిపోయిన వారి సంఖ్య : 32

ఇవీ నిబంధనలు.. అర్హత ప్రమాణాలు

- గల్ఫ్ దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఒమాన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్‌లో మరణించిన వారికి వర్తింపు
- మరణించిన గల్ఫ్ బాధితుడి భార్య, పిల్లలు, తల్లిదండ్రులు ప్రాధాన్యక్రమంగా చూసి పరిహారం అందజేస్తారు
- గల్ఫ్ కార్మికుడి మరణ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు, ఉద్యోగం రుజువులు (వర్క్ వీసా, ఉద్యోగ ఒప్పందం) ధ్రువపత్రాలు సమర్పించాలి.
- గల్ఫ్‌లో మరణించిన కార్మికుడి కుటుంబ సభ్యులు పరిహారం కోసం కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించాలి. అర్హులైన దరఖాస్తుదారుల చెల్లుబాటు అయ్యే బ్యాంకు ఖాతా వివరాలు అందజేయాలి.
- గల్ఫ్‌లో కార్మికుడి మరణం ధ్రువీకరించిన తర్వాత కలెక్టర్ అర్హత గల కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లింపునకు ప్రొసీడింగ్ జారీ చేస్తారు.
- మృతి చెందిన తేదీ లేదా మృతదేహాన్ని స్వీకరించిన తేదీ నుంచి ఆరు నెలల లోపు కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించాలి
- మంజూరైన రూ.5 లక్షలు అర్హత ఉన్న కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాకు నేరుగా బదిలీ చేస్తారు.



చంద్రపూర్‌లో సరిహద్దు జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమైన ఐజీ దిలీప్ పాటిల్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించండి

● కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులతో మహారాష్ట్ర ఐజీ దిలీప్


బల్లార్ష, న్యూస్‌టుడే: త్వరలో మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సరిహద్దున ఉన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన పోలీసు అధికారులు సహకరించాలని నాగపూర్ ఐజీ దిలీప్ పాటిల్ అన్నారు. సరిహద్దు జిల్లాలైన కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులతో చంద్రపూర్‌లోని రేంజర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్ర-తెలంగాణ రాష్ట్రాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా తోడ్పాటు అందించాలన్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్, యావత్మాల్, గడ్చిరోలి జిల్లాలకు సరిహద్దున కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లాలు ఉన్నాయని, ఈ సరిహద్దున ఆరు చెక్‌పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఇవి కాకుండా ఇతర మార్గాల ద్వారా మద్యం, డబ్బు అక్రమంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వీటిని నిరోధించేందుకు రెండు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచాలని పేర్కొన్నారు. సరిహద్దు జిల్లాల అటవీ, రెవెన్యూ అధికారుల సహాయ సహకారాలు అవసరమైతే వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా స్పెషల్ బ్రాంచి ఎస్పీ శ్రీనివాస్ పోతారం, కుమురంభీం జిల్లా అడిషినల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, గడ్చిరోలి స్పెషల్ బ్రాంచి ఎస్పీ విశాల్ నాగర్‌గోజే, యావత్మాల్ ఎస్పీ పంకజ్ ఆసియా, చంద్రపూర్ కలెక్టర్ వినయ్‌గౌడ, ఎస్పీ సుదర్శన్ ముమ్ముక్కా తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు చివరి తేదీ 15

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 15న చివరి తేదీ అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.సుధాకర్, సమన్వయకర్త గంగాధర్ తెలిపారు. ఇంటర్ తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు అధ్యయన కేంద్రంలో లేదా 73829 29703 నంబరులో సంప్రదించాలన్నారు.

ఒకరితో ఒకరు పోటీపడి..

కొలువు కొట్టి!



● ఆ కుటుంబాల నుంచి ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులు..

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: లక్ష్యం పెట్టుకుని ఇష్టంతో చదివితే విజయం సొంతమవుతుందని యువత నిరూపిస్తున్నారు. ఒకే కుటుంబం నుంచి అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు పోటీపడి మరీ చదివి ఇటీవలి డీఎస్సీ ఫలితాల్లో మెరిశారు. ఎంపికైన వారు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు.

టీచర్ల కుటుంబం..



సోదరులు మహమ్మద్ హుజైఫా, మహమ్మద్ హమ్జా

కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) మండలం లోనవెల్లి గ్రామానికి చెందిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు దానీష్ అహ్మద్‌కు ఇద్దరు కుమారులు. మహమ్మద్ హుజైఫా ఎస్జీటీగా, మహమ్మద్ హమ్జా తెలుగు పండిత్‌గా కొలువులు సాధించారు. 1-10వ తరగతి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకొన్నారు. తండ్రిని ఆదర్శంగా తీసుకొని ఉద్యోగాలు సాధించినట్టు సోదరులిద్దరూ చెబుతున్నారు. వీరి పెద్దనాన్న మన్సూర్ అహమ్మద్ విశ్రాంత స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు కాగా ఇద్దరు బాబాయ్‌లు అనీష్ అహ్మద్, రయీస్ అహ్మద్‌లు సైతం స్కూల్‌అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

నాడు అక్క.. నేడు ఇద్దరు చెల్లెలు



అక్కాచెల్లెలు సౌమ్య, కావ్య

కాగజ్‌నగర్ పట్టణం ద్వారకానగర్‌కు చెందిన వ్యవసాయ దంపతులు గోలెం కళావతి-శ్రీనివాస్‌కు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు. పెద్ద కుమార్తె సౌందర్య 2012 డీఎస్సీలో ఎస్జీటీ ఉపాధ్యాయురాలిగా కొలువు సాధించారు. మిగతా ఇద్దరు కుమార్తెలు సౌమ్య, కావ్య.. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ ముగ్గురు కూడా స్థానిక సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 1-10 తరగతి వరకు చదువుకున్నారు. ఒకే కుటుంబం నుంచి ముచ్చటగా ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉపాధ్యాయులుగా కొలువులు సాధించారు. అక్కను స్ఫూర్తిగా తీసుకొని లక్ష్యంతో చదివినట్లు వారు తెలిపారు.

పాతికేళ్లలోపే కొలువు పట్టేశారు!



తల్లిదండ్రులతో అభిషేక్, అభిలాష్

ఒకే ఇంటి నుంచి ఇద్దరు సోదరులు ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. ఆదిలాబాద్ పట్టణం దస్నాపూర్ కాలనీకి చెందిన ఆర్టీసీ కండక్టర్ శ్రీరాములు-పద్మ దంపతుల కుమారులు నర్సర్వార్ అభిషేక్-అభిలాష్‌లు. వీరి అక్క బావ మౌనిక-నరేష్‌లు సైతం ఉపాధ్యాయులే. అభిషేక్ 13వ ర్యాంకుతో ఓపెన్ కేటగిరిలో, అభిలాష్ 72వ ర్యాంకుతో రిజర్వేషన్ కేటగిరిలో ఉద్యోగాలు సాధించారు. - న్యూస్‌టుడే, పాలనాప్రాంగణం

బాసరకు ఆధ్యాత్మిక శోభ

● ఘనంగా మూలా నక్షత్ర వేడుకలు



గోదావరి ఘాట్ వద్ద శివలింగానికి పూజలు



సామూహిక అక్షరాభ్యాసం



గోదావరిలో సూర్యనమస్కారం చేస్తున్న యువతి



కమలం పువ్వుతో భక్తురాలు



అక్షరాభ్యాసం అనంతరం పలక, బలపంతో చిన్నారి



ప్రత్యేక అలంకరణలో జ్ఞానసరస్వతి అమ్మవారు

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: మూలా నక్షత్ర శుభ సమయంలో జ్ఞాన సరస్వతి అమ్మవారి చెంత అక్షర శ్రీకారానికి వచ్చిన చిన్నారులతో బాసర ఆలయం, అక్షరాభ్యాస మండపాలు కళకళలాడాయి. ఆలయంలో వేద మంత్రాలు, గోదావరిలో పుణ్యస్నానాలు, భక్తుల మొక్కులతో బుధవారం ఆలయంలో ఆధ్మాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. వేకువజామున 2 గంటలకు మూలా నక్షత్ర పూజ చేసి అక్షరాభ్యాసాలు మొదలుపెట్టారు. ఉదయం భక్తుల రద్దీ నెలకొన్నా మధ్యాహ్నానికి తగ్గింది. అమ్మవారి దర్శనం, పూజలు, అక్షరాభ్యాసాలకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటుచేశారు. పుణ్యస్నానాలు, కుంకుమార్చనలు, గంగమ్మ ప్రతిమ చుట్టూ ప్రదక్షిణలతో గోదావరి తీరం పులకించింది. సప్తమి ఘడియల్లో సరస్వతి అమ్మవారు కాళరాత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పూట అమ్మవారికి రాజోపచార, చతుషష్టి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో మహా మంగళహారతి పూజలు శాస్త్రోక్తంగా చేశారు. సుమారు 30 వేలకుపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. క్యూలైన్లలో ఉన్న చిన్నారులకు పాలు, బిస్కెట్లు అందజేశారు. పిల్లలకు పాలు పట్టేందుకు బాలింతలకు ఫీడింగ్ గదులు ఏర్పాటు చేశారు. 200 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. గతేడాదితో పోలిస్తే భక్తుల తాకిడి తగ్గింది. వీఐపీ పాసులను నిలిపివేయడంతో హడావుడి లేకుండా క్యూలైన్ ముందుకు సాగింది. భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లను తీసుకున్న వారికి ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో అక్షరాభ్యాసాలు చేయించారు. ఆలయంలోని మహాకాళి దర్శనం కోసం వెళ్లే మార్గంలో బారికేడ్లు ఏర్పాటుచేయడంతో భక్తులు కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

సరస్వతి అమ్మవారిని ఎంపీ నగేశ్, ముథోల్, సిర్పూర్(టి) ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబు, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, భారాస నాయకురాలు రమాదేవి, తెలంగాణ సినీ నటుడు రోషం బాలు, ఆయా పార్టీల నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చెందిన అతిథి గృహాలు అధికారులు, వీఐపీలకు కేటాయించడంతో సాధారణ భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత సంవత్సరం ఎదురైన ఇబ్బందుల దృష్ట్యా చాలా మంది భక్తులు బాసరకు రాలేదు. ఆలయ పక్షాన వసతి గదులు అందుబాటులో లేనందున ప్రైవేట్ లాడ్జిల నిర్వాహకులు ఇష్టం వచ్చిన ధరలు వసూలు చేశారు.

తగ్గిన అక్షరాభ్యాసాలు

గతేడాదితో పోలిస్తే భక్తుల రద్దీతో పాటు అక్షరాభ్యాసాలు కూడా తగ్గాయి. రూ.1000 ప్రత్యేక అక్షరాభ్యాసాలు 1621, రూ.150 అక్షరాభ్యాసాలు 609 నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 200 మంది చిన్నారులు అక్షరాభ్యాసాల టికెట్లు కొనుగోలు చేశారని ఆలయ ఈవో విజయరామారావు చెప్పారు. అక్షరాభ్యాసాలకు 2-4 గంటల సమయం పట్టింది. ఆలయానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చింది. గత ఏడాది 2739 అక్షరాభ్యాసాలు జరిగాయి. రూ.35 లక్షల ఆదాయం సమకూరింది.



బందోబస్తు పర్యవేక్షిస్తున్న భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్



దర్శనానికి వస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్, తదితరులు

వరి పొలంలో పులి కళేబరం



బల్లార్ష, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా సావిలీ అటవీ రేంజి పరిధి డోంగర్‌గావ్ గ్రామ పరిసరాలలోని వరి పొలంలో బుధవారం పులి కళేబరాన్ని రైతులు గుర్తించారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారమివ్వగా. . వారు కళేబరాన్ని చంద్రపూర్‌కు తరలించారు. చనిపోయింది ఆడ పులి అని, ఏడాదిన్నరేళ్ల వయసు ఉంటుందని పరీక్షల తర్వాతే మృతికి గల కారణాలు తెలుస్తాయని సావిలీ అటవీ క్షేత్ర అధికారి వినోద్ దుర్వే తెలిపారు.

విధులకు వెళుతుంటే విధి వంచించింది

● జాతీయ రహదారిపై చెట్టును ఢీకొన్న కారు

● తండ్రి, కుమారుడి దుర్మరణం.. తీవ్రంగా గాయపడ్డ తల్లీకుమార్తెలు



సంగం సురేశ్



సాయివర్షిక్



నిర్మల్-భైంసా జాతీయ రహదారిలో నందన్ సమీపంలో రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టిన కారు

లోకేశ్వరం/నర్సాపూర్(జి): న్యూస్‌టుడే: తెల్లవారుజామున లేచి విధులకు హాజరుకావాలన్న ఆలోచనతో హడావుడిగా భార్యాపిల్లలతో కారులో బయలుదేరిన విద్యుత్తు ఉద్యోగి కుటుంబాన్ని విధి వంచించింది. కారు ముందు టైరు పగిలి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ చెట్టును ఢీకొట్టిన ఘటనలో తండ్రి, కుమారుడు దుర్మరణం పాలవగా తల్లి, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. నిర్మల్-భైంసా జాతీయ రహదారిలో నందన్ సమీపంలో బుధవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నర్సాపూర్(జి) ఎస్సై హన్మాండ్లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం మండలం మన్మద్ వాసి సంగం సురేశ్(28) మన్మద్ విద్యుత్తు ఉపకేంద్రంలో ఆపరేటరుగా పనిచేస్తున్నారు. మంగళవారం భార్య ప్రియాంక, కుమారుడు సాయివర్షిక్, కూతురు తనిష్కలతో కలిసి అత్తగారి ఊరైన బోథ్ మండలం కుచులాపూర్ వెళ్లారు. రాత్రికి అక్కడే ఉన్నారు. బుధవారం విధులకు హాజరయ్యేందుకు ఉదయమే భార్యాపిల్లలతో తన సొంత కారులో మన్మద్ బయలుదేరారు. ఉదయం 9 గంటల సమయంలో నర్సాపూర్(జి) మండలం నందన్ దాటగానే కారు ముందు టైరు పగిలింది. అతివేగం కారణంగా అదుపుతప్పి రోడ్డు పక్కనే గల చెట్టును బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ కుమారుడు సాయివర్షిక్(6) అక్కడికక్కడే మరణించగా తీవ్రంగా గాయపడ్డ సురేశ్, భార్య ప్రియాంక, కూతురు తనిష్కలను స్థానికులు అంబులెన్సులో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యలోనే సురేశ్ మృతిచెందినట్లు నిర్ధారించారు. తీవ్ర గాయాల పాలైన ప్రియాంకకు ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించారు. తనిష్క నిర్మల్‌లో చికిత్స పొందుతోంది. సురేశ్ అత్త మచ్చెర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

మన్మద్‌లో విషాదఛాయలు..

అందరితో కలుపుగోలుగా ఉండే సురేశ్‌తో పాటు చిరునవ్వులు చిందించే సాయివర్షిక్‌లు మృతి విషయం తెలియగానే మన్మద్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్థులు ప్రమాద తీరును చూసి చలించారు.

పంట నష్టపరిహారం మంజూరు

జిల్లా	ఎకరాలు	రైతులు	పరిహారం (రూ.కోట్లలో)
ఆదిలాబాద్	3096	2041	3.09
కుమురం భీం	2692	1371	2.69
మంచిర్యాల	598	447	0.59

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం : ఉమ్మడి జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వరుసగా కురిసిన వర్షాలతో వాగులతో పాటు సరిహద్దులో ఉన్న పెన్‌గంగ ఉద్ధృతి కారణంగా పలు గ్రామాల్లో పంటలు నీట మునిగి రైతులు పంటలను నష్టపోయారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గ్రామాల వారీగా సర్వే చేసి ప్రతిపాదనలు పంపించారు. ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించనున్నారు.

పట్టగొలుసు మింగిన చిన్నారి.. తప్పిన ప్రాణాపాయం



ప్రాణాపాయం తప్పిన చిన్నారి ధ్రుతి



ఏడు నెలల చిన్నారి గొంతులో ఇరుక్కున్న వెండి పట్టగొలుసు

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : ఏడు నెలల చిన్నారి పట్టగొలుసు మింగటంతో గొంతులో ఇరుక్కొని ప్రాణాపాయంగా మారగా ఆదిలాబాద్ రిమ్స్ వైద్యులు చాకచక్యంగా బయటకు తీసి ప్రాణాలను కాపాడారు. గుడిహత్నూర్‌కు చెందిన ధ్రుతి(7 నెలలు) కాలికి ఉన్న వెండి పట్టగొలుసును నోట్లో పెట్టుకోవడంతో బుధవారం గొంతులో ఇరుక్కుపోయింది. కుటుంబ సభ్యులు పాపను రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేసే మామిడి హేమంతరావు(ఈఎన్‌టీ) చాకచక్యంగా ఎండోస్కోపి చేసి గొంతులో ఇరుక్కున్న పట్టగొలుసును బయటకు తీశారు. రిమ్స్ సంచాలకుడు జైసింగ్ రాథోడ్ వైద్యుడు హేమంతరావును అభినందించారు.